W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

18-10-2025





09

## కలిసొచ్చిన ముహూర్తం.!

- రుసుము పెరిగినా ఆగని టెండర్ల హొరు
- చివరి రోజుల్లో మద్యం టెండర్ల హడావిడి
- ఉమ్మడి ఖమ్మంలో మద్యం టెండర్ల జోష్

తెలంగాణ రాష్ట్రంలో మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ ఈసారి రాజకీయ వేడిలోనూ వ్యాపార జోష్‌లోనూ కొనసాగుతోంది.



09

## ఫారెస్ట్ ప్లాంటేషన్‌లో కలప చోరీ

### అటవీ శాఖ అధికారులపై విమర్శల వెల్లువ

మండల పరిధిలోని గుండెపుడి బీట్ పరిధిలో ఫారెస్ట్ జామాయిల్ ప్లాంటేషన్ లో విలువైన కలప చోరీకి గురవుతుంది. ఈ తతంగమంతా చాలా రోజుల క్రితం నుండే గుట్టు చప్పుడు కాకుండా జరుగుతుంది. ఈ క్రమంలో ఇది గమనించిన గ్రామస్తులు కొందరు విషయం బయట పెట్టడంతో కలప దొంగతనం తెలుగులోకి వచ్చింది.



10

## రాజకీయ రక్షణ కవచం!

- అవినీతి యథాతథం
- వైరా వేర్‌హౌస్‌లో విపరీతాల వనరులు!
- పోస్టుల పదిలం  కోసం పరాకాష్టకు పైరవి
- తనిఖీతో సరిపెట్టుకున్న ఉన్నతాధికారులు
- నేతల చుట్టూ ప్రదక్షిణలు
- ప్రజా ధనం లూటీ!



07

## ములకలపల్లి మృత్యు వారధి

ఖమ్మం-మహ బూబాబాద్ జిల్లాలను అను సంధానించే ములకలపల్లి వారధి, పాలేరు ప్రాంత ప్రజలకు ముఖ్యమైన జీవనాధారం. గత సంవత్స రం వచ్చిన పెను వరదలకు ధ్వంసమైన ఈ కీలక వంతెన స్థానంలో, ప్రభుత్వం హడావుడిగా తాత్కాలిక వారధిని నిర్మించి తాత్కాలిక ఉపశమనం కల్పించింది.




08

# కాంగ్రెస్ పటిష్ఠానికి వ్యూహారచన!

### డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై భట్టి, మహీరధన్ చర్చలు

- యువ నాయకత్వానికి ప్రాధాన్యమే లక్ష్యం
- పాత-కొత్త నేతల సమన్వయమే విజయమార్గం
- పార్టీ బలోపేతంపై ఏఐసీసీ పరిశీలకుడి దృష్టి



ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పునర్వ్యవస్థీకరణకు నూతన ఊపిరి పోసే ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. డీసీసీ అధ్యక్షుడి ఎంపికను దృష్టిలో ఉంచుకుని ఏఐసీసీ నియమించిన పరిశీలకుడు  మహీరధన్ జిల్లా పర్యటనలో శుక్రవారం కీలక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు జిల్లా కాంగ్రెస్ కీలక నేతలతో సుదీర్ఘ చర్చలు సాగాయి. పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే ఈ సమావేశం, ఖమ్మం రాజకీయ వాతావరణానికి కొత్త ఉత్సాహాన్ని తెచ్చిందని చెప్పాలి. ప్రతి నియోజకవర్గ స్థాయిలో పార్టీ శక్తి, వర్గాల సమన్వయం, యువత పాత్ర, నూతన నాయకత్వం వంటి అంశాలు విశ్లేషణకు వస్తూ, కాంగ్రెస్ పునరుజ్జీవన యాత్రలో ఇది ముఖ్య ఘట్టంగా నిలిచింది.

ఖమ్మం బ్యూరో, మహా

FOLLOW: @ANNTELUGU
18-10-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# సింగరేణి కార్మికులకు గుడ్ న్యూస్!

## దీపావళి కానుకగా 400 కోట్ల బోనస్

- బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డు
- బీసీ బంద్‌కు అందరూ మద్దతు ఇవ్వాలి
- బిల్లు విషయంలో మీరే నాయకత్వం వహించండి
- 23న కేబినెట్‌లో బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం, మహా:** దేశానికి వెలుగులు పంచే సింగరేణి కార్మికులకు ఈ దీపావళి సందర్భంగా 400 కోట్ల రూపాయల బోనస్‌ను ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఇది కార్మికుల కష్టానికి గౌరవప్రదమైన గుర్తింపు అని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల త్యాగం, శ్రమ, అంకితభావాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, వారికి ఆనందాన్ని పంచాలని నిర్ణయించిందని వెల్లడించారు. సింగరేణి దేశానికి వెలుగులు నింపుతున్న శక్తి కేంద్రం. కార్మికులు రాత్రింబవళ్లు శ్రమించి, రాష్ట్రానికి గర్వకారణమవుతున్నారు. అలాంటి కార్మికులకు దీపావళి బోనస్ ప్రకటించడం ప్రభుత్వం చేసిన చిన్న కృతజ్ఞత” అని అన్నారు.

### బీసీ రిజర్వేషన్లపై బిజెపి కుట్రలు

డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా అడ్డుకున్నది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. “బీసీల హక్కులపై బిజెపి వైఖరి ప్రజాస్వామ్య వ్యతిరేకం. రాష్ట్రం నుంచి అఖిలపక్షంగా వెళ్లి రాష్ట్రపతిని, ప్రధానమంత్రిని కలుసుకోవాలనుకున్నా అనుమతి ఇవ్వలేదు. బిజెపి నైజం ఇప్పుడు దేశమంతా తెలుసుకుంది” అని భట్టి వ్యాఖ్యానించారు. బీసీలకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ వెనక్కి తగ్గదు. రిజర్వేషన్ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉంది. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఈ అంశంపై చర్చించి ఈ నెల 23న జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటాం” అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

### బీసీ బంద్‌కు మద్దతు తెలపాలని పిలుపు

అక్టోబర్ 18న రాష్ట్రవ్యాప్తంగా బిజెపికి వ్యతిరేకంగా జరుగుతున్న బీసీ బంద్‌లో అందరూ పాల్గొనాలి. ఇది కేవలం రాజకీయ ఉద్యమం కాదు ఇది బీసీల ఆత్మగౌరవ పోరాటం” అని భట్టి పిలుపునిచ్చారు. అలాగే ఆయన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావులను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు ప్రధాని మోడీ, రాష్ట్రపతి వద్ద బీసీ బిల్లు ఆమోదం కోసం సమయం తీసుకొని నాయకత్వం వహించండి. రాష్ట్రంలోని అఖిలపక్ష నాయకత్వం ఢిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉంది. కానీ మేము అడిగితే కేంద్ర పెద్దలు సమయం ఇవ్వడం లేదు” అని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు పోట్ల నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, కొత్త సీతారాములు, జావేద్ తదితరులు పాల్గొన్నారు



### బీసీల కోసం కాంగ్రెస్ ధృఢనిశ్చయం

భట్టి విక్రమార్క మాట్లాడుతూ, “కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల గౌరవం ఉంది. వారి రాజకీయ, సామాజిక స్థాయిని పెంచడం మా లక్ష్యం. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం బీసీ సంక్షేమం కోసం చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. రాబోయే రోజుల్లో బీసీలకు రిజర్వేషన్ల హక్కు కేవలం వాగ్దానం కాదు, ఆచరణలోకి తీసుకురావడమే మా ధ్యేయం అని స్పష్టం చేశారు.

# శాస్త్రీయ విద్య విధానమే అంతిమ లక్ష్యం

**విద్య వ్యాపారీకరణకు వ్యతిరేకంగా విద్యార్థుల ఐక్యం కావాలి**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్**



**మణుగూరు, మహా:** విద్య వ్యాపారీకరణను అడ్డుకోవాలంటే విద్యార్థులు ఐక్యంగా ముందుకు రావాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కేవలం చదువుతో పరిమితం కాకుండా, సమాజాన్ని కూడా చదవాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, బెనారస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు దేశ స్వాతంత్ర్యం కోసం పిడికిలి బిగించి ప్రారంభించిన ఏఐఎస్ఎఫ్ సంస్థ నేటికి 90 సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఆయన గుర్తుచేశారు. ఏఐఎస్ఎఫ్ అనేది స్వాతంత్ర్య సమర స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య స్థిరత్వానికి కృషి చేస్తున్న విద్యార్థి సంఘమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్పొరేట్ ప్రైవేటీకరణ విధానాలు విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు విద్యార్థులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. శాస్త్రీయ విద్యా విధానం స్థాపనకై, సమ సమాజ నిర్మాణం కోసం ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఏఐఎస్ఎఫ్ చేపట్టబోయే అన్ని విద్యా ఉద్యమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని వరక అజిత్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పవన్ సాయి, విద్యార్థినులు కళ్యాణి, సుప్రియ, మానస తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్న బిజెపి

**కూసుమంచి, మహా:** బిసి లకు 42% రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటున్న బిజెపి వైఖరిని ఖండించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మోడీ దిష్టిబొమ్మను (బిజెపి )దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకై అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ కు బిల్లును పంపితే కేంద్రంలో ఉన్న బిజెపి కావాలనే బిల్లును పాస్ చేరకుండా ఆపిందని విమర్శించారు. ఇది ముమ్మాటికి బిజెపి కుట్ర అని దీనిని అందరూ తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. బీసీలకు జరుగుతున్న అన్యాయం పై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు శీలం గురుమూర్తి,యడవల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, గన్యా నాయక్, చీర్ల రాధాకృష్ణ, గోపె వెంకన్న, ఎస్ .కే బాబు, వివిధ గ్రామాలకు చెందిన సిపిఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.






మహా పత్రిక
ANN తెలుగు



## విద్యార్థిని వైద్య చికిత్స కోసం ఎల్‌ఓసి అందించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం, మహా:** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు, తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఇంటర్ విద్యార్థిని పి. శ్లోక వైద్య చికిత్స నిమిత్తం లక్ష రూపాయల ఎల్‌ఓసి అందజేశారు. ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని పి. శ్లోక ఐదేళ్లుగా ఎముకలకు వచ్చిన ట్యూమర్ కారణంగా ఇబ్బంది పడుతోందని, ఇప్పటికే ఎడమ చేయి తొలగించగా, వెన్నెముక సర్జరీ కూడా జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఊపిరితిత్తుల్లో కూడా ట్యూమర్ ఏర్పడిందని, తండ్రి కూడా లేకపోవడంతో, చికిత్స కోసం ఆర్థిక సాయం చేయాలంటూ మంత్రివర్యులు తుమ్మల ను శ్లోక కుటుంబ సభ్యులు ఆశ్రయించగా, ప్రభుత్వం ద్వారా ఒక లక్ష రూపాయలకు మంత్రి తుమ్మల ఎల్‌ఓసి ఇప్పించారు. కృత్రిమ చెయ్యి ఏర్పాటుతో పాటు, పై చదువుల విషయంలో సాయం చేస్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. ప్రస్తుతం శ్లోక ఖమ్మంలోని సాహితి ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, తదితరులు పాల్గొన్నారు.

# భూపరిపాలనలో మరో ముందడుగు

## ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు

### 19న ముఖ్యమంత్రి చేతుల మీదుగా లైసెన్సుల పంపిణీ: మంత్రి పొంగులేటి

**కూసుమంచి, మహా:** తెలంగాణ ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి మెరుగైన సేవలను అందించడానికి, రాష్ట్రంలో భూములకు సంబంధించిన అనేక పంచాయితీలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే గ్రామ పాలనాధికారులు ( జీపీవో)ను అందుబాటులోకి తీసుకురాగా తాజాగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సులభంగా భూ సేవలు అందేలా ప్రతి మండలానికి కనీసం 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈనెల 19వ తేదీన శిల్ప కళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గచేతుల మీదుగా శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్ ను జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా ప్రభుత్వ లక్ష్యం



నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 350 మంది సర్వేయర్లు సరిపోరని, మరికొంత మంది సర్వేయర్లు అవసరమవుతారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక వైపు లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులు భర్తీచేయడం, ఇంకోవైపు భూముల సర్వేకు అవసరమైన అత్యాధునికి పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూశాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్, సర్వే విభాగం కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంత్ తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రిగారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావడానికి దరఖాస్తులను ఆహ్వానించగా పది వేల మంది దరఖాస్తు చేసుకోగా తొలివిడతలో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చామని ఇందులో 3465 మంది అర్హత సాధించారని తెలిపారు.

## బీసీ బంద్‌ను జయప్రదం చేయండి

**జూలూరుపాడు, మహా:** బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్18న బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర బంద్ ను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎవిఆర్ ఫంక్షన్ హాల్ లో కడియాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పాల్గొని మాట్లాడారు. అక్టోబర్18న తలపెట్టిన రాష్ట్ర బిసి బంద్ కు అఖిలపక్షం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ బంద్ కు ప్రజలు, ప్రజా స్వామిక వాదులు, విద్యార్థి, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు ఏదులాపురం గోపాలరావు, సిపిఎం మండల కార్యదర్శి యాస నరేష్, సిపిఐ మండల నాయకులు ఎస్.కె చాంద్ పాషా, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వల్లోజి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపి

**బూర్గంపాడు మహా:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాటకం ఆడుతుందని సిపి ఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. టేకుల చెరువు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకిస్తుందని ఆయన విమర్శించారు. ఒక వైపు కేంద్రంలో బీసీ రిజర్వే షన్ల బిల్లును ఆర్డినేన్స్ ను అడ్డుకుంటూ ఇంకో వైపు రాష్ట్రంలో ఈనెల 18 న బిసి జేఏసీ రాష్ట్ర బంద్ కు బిజెపి మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్ని దేనాని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభు త్వం తీరుకు వ్యతిరేకంగా పోరాడితేనే ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బందులో పాల్గొంటామని లేదంటే స్వతంత్రంగా ఉద్యమి స్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాండవుల రామనాథం, గుంటుక కృష్ణ, రాయ ల వెంకటేశ్వర్లు, పార్టీ సభ్యులు కందుకూరు నాగేశ్వరావు,బండారు రాకేష్, నరేష్ పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా

**బూర్గంపాడు మహా :** మండల కేంద్రమైన బూర్గంపాడులోని తహశీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ఎమ్మా ర్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, అనుబంధ సంఘాల నాయకత్వం లో నల్ల జెండాలతో నిర సన తెలియజేసి డిప్యూటీ తహశీల్దారు కు వినతి పత్రం అందజేశారు.ఈ దేశ అత్యంత న్యాయస్థానం సుప్రీంకోర్టు సిజెఐ మీద దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు నల్లజెం డాలతో నిరసన తెలియజేసి డిప్యూటీ తహశీ ల్దార్ కు కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి రావులపల్లి ఈశ్వరయ్య మాదిగ, సోంపాక హబ్బులు మాదిగ, వెంకన్న, ఎం.ఈ ఎఫ్ నా యకులు మిరియాల నరసింహారావు మాదిగ, చెక్క వెంకటేష్ మాదిగ, బీసీ సంఘం మండల నాయకులు దాసరి సాంబ, ,మిర్యాల దుర్గాప్ర సాద్ మాదిగ,ఇనపనూరు గోపి మాదిగ, వడ్ల కొండ పున్నం మాదిగ, తోకల లక్ష్మయ్య మా దిగ, చెక్క వెంకటమ్మ మాదిగ కాకటి విజయ మ్మ మాదిగ పాల్గొన్నారు.



# రైజింగ్ విజన్ 2047 అమలులో విద్యుత్ శాఖ కీలక పాత్ర

## పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా ఇన్ ఫ్రా పెంచుకోవాలి

## సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు

- ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- డయల్ 1912 ప్రతిష్టాత్మకమైనది పరీక్షించేందుకు నేనే స్వయంగా ఫోన్ చేస్తా
- విద్యుత్ సిబ్బందికి ప్రత్యేక యూనిఫామ్
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ శాఖ పని తీరుపై సమీక్షించిన భట్టి



**ఖమ్మం బ్యూరో, మహా:** తెలంగాణ రైజింగ్ విజన్ 2047 అమలులో విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డిప్యూటీ సీఎం, ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అందిన ప్రతి సలహా నోట్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ కోరిన విధంగా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా సబ్ స్టేషన్ల ఏర్పాటుకు స్టడీ చేసి ప్రతిపాదనలు తయారు చేయాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ఖమ్మం జిల్లాలో పెరుగుతున్న పారిశ్రామిక అవసరాల దృష్ట్యా రెండు 400 కేవి సబ్ స్టేషన్ లను మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలో 5 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు మంజూరు చేశామని, ప్రతి యంగ్ ఇండియా స్కూల్ ఒక గ్రామం తలపిస్తుందని, కొత్త పారిశ్రామిక పార్కులను ఖమ్మం జిల్లాకు మంజూరు చేయడం జరిగిందని, వీటిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ పంపిణీ, రవాణా వ్యవస్థ బలోపేతం చేయాలని అన్నారు. విద్యుత్ స్తంభాలు, వైర్లు లూజుగా ఉండటం వల్ల ప్రాణ నష్టం జరగడానికి వీలు లేదని, పొలం బాట కార్యక్రమం కింద ప్రతివారం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ నివారణ చర్యలు కట్టుదిట్టంగా చేపట్టాలని డిప్యూటీ సీఎం విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వరదల, వర్షాల సమయంలో నీటిలోనే వెళ్లి మన విద్యుత్ సిబ్బంది పనిచేసి రికార్డు సమయంలో విద్యుత్ పునరుద్ధరణ చేస్తున్నారని అన్నారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న సిబ్బంది కృషి ఫలితాన్ని కొద్దిమంది తమ స్వార్థం కోసం చెడగొట్టకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. అధికారులు, సిబ్బంది సంయుక్తంగా పని చేస్తూ విద్యుత్ శాఖకు మంచి పేరు తీసుకుని రావాలని అన్నారు. గతంలో సంవత్సరాలుగా పదోన్నతులు, బదిలీలు జరగలేదని, మన ప్రజా ప్రభుత్వంలో పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా జరిగాయని, ఇటీవల డైరెక్టర్ల నియామకం కూడా చేశామని అన్నారు.



# దళితుల ఆత్మగౌరవ నిరసన

**జూలూరుపాడు, మహా:** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చంగల గురునాథం మాదిగ పాల్గొని మాట్లాడుతూ భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి పై దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ ను కఠినంగా శిక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అన్నారు. సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి అనాగరికమని, ఈ దాడి ప్రజాస్వామిక స్ఫూర్తి, రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే భావించాలని అన్నారు. ఈ దాడి దళిత, పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురిచేసిందని, దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిని దేశ ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాహాసిల్దార్ శ్రీనివాస్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో చాపలమడుగు నరసింహారావు, గార్లపాటి కృష్ణ, ఇస్సన్నపల్లి కళ్యాణ్, జంగం నాగరాజు, కాకటి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ సాగర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



**బూర్గంపాడు మహా :** మండలంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల కృష్ణ సాగర్ నుండి 9 మంది విద్యార్థులు అంతర్ జిల్లా క్రీడలలో అత్యద్భుతమైన ప్రతిభ కనబరిచి ఎస్ జి ఎఫ్ అండర్- 19 రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. వాలీబాల్ అండర్-19 లో బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.శ్యామ్ ప్రసాద్,హ్యాండ్ బాల్ అండర్ -19 లో హెచ్ఇసి ద్వితీయ సంవత్సరం చదువుతు న్న ఎం.జనార్ధన్, ఎంపీసీ ద్వితీయ చదువుతు న్న సిహెచ్.నవదీప్ ఎంపికయ్యారు. అలాగే హాకీ అండర్-19కు బైపిసి ద్వితీయ సంవత్స రానికి చెందిన కె.కృష్ణప్రసాద్, ఎంపీసీ ద్వితీ య సంవత్సరానికి చెందిన బి.తులసి రామ్, ఎంపీసీ ద్వితీయ సంవత్సరానికి చెందిన ఎల్. భరత్, బైపీసీ ద్వితీయ సంవత్సరానికి చెందిన పి. పార్థివే, హెచ్ఈ సి ద్వితీయ సంవత్సరానికి చెందిన ఎం.రామచరణ్ ఎంపిక అయ్యారు. అదేవిధంగా టేబుల్ టెన్నిస్ అండర్-19 బైపి సి ద్వితీయ సంవత్సరానికి చెందిన కె. శేషంత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ సాగర్ కళాశాల ప్రిన్సిపా ల్ మెండెం దేవదాస్ మాట్లా డుతూ కళాశాల విద్యార్థులు వాలీబాల్, హాకీ, హ్యాండ్ బాల్, టేబుల్ టెన్నిస్ లలో అత్యంత ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపి క అవ్వడం మా కళాశాలకు, తెలంగాణ గురు కులాల విద్యాసంస్థకు భవిష్యత్తులో మంచి పే రు తప్పకుండా వస్తుందని ఆయన అన్నారు.

# బీటీపీఎస్‌లో గిరిజనుల హక్కులు పక్కకు



**మణుగూరు, మహా:** ఐటిడీఏ పీవో 2018లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం బీటీపీఎస్ ప్రభావిత ఆదివాసి గ్రామాలు, సొసైటీలకు నిర్దిష్ట శాతం పనులు కేటాయించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, ప్రస్తుత స్థానిక టీజి జెన్కో అధికారులు వాటిని విస్మరిస్తున్నారని గిరిజనులు ఆరోపించారు. వీటీఈడీఏ సొసైటీలతో పాటు ఎస్టీ కోయ కాంట్రాక్టర్ల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం డిటిపిఎస్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన నాయకులు మాట్లాడారు. స్థానిక రాజకీయ నాయకులు, నియమిత బిల్డర్ల అనుచరుల ప్రభావంతో ఆదివాసులకు కేటాయించాల్సిన పనులు ఇతరులకు కేటాయిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బీటీపీఎస్ పరిధిలో ఉన్న బాయిలర్, టర్బైన్, ఈఎస్పీ, పంప్ హౌస్, సర్వీస్ బిల్డింగ్, గార్డెన్, కోల్ క్లీనింగ్ వంటి అన్ని అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్ మెయింటెనెన్స్ పనులు స్థానిక గిరిజనులకు కేటాయించాలనే నిబంధన ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఆ విధంగా బిటిపిఎస్ అధికారులు ఉపాధి కల్పించలేదని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ అవసరాల పేరుతో తమ భూములను స్వాధీనం చేసుకున్న తర్వాత జీవనోపాధి లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని బాధితులు తెలిపారు. లంచాలు తీసుకుంటూ అధికారులు, బిల్డర్లు గిరిజనేతరులకు పనులు కేటాయించడం సరికాదని, ఐటిడీఏ సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. బీటీపీఎస్ టెండర్లలో పినపాక నియోజకవర్గం అని పేర్కొనడం తప్పు అని, బీటీపీఎస్ జెన్కోగా మాత్రమే చూపించాల్సిందని గిరిజనులు పేర్కొన్నారు. డ్రై ఫ్లయ్ యాష్ రవాణా పనులు, యాష్ పాండ్ ట్రాన్స్‌పోర్ట్ పనులు, టిప్పర్లు, ట్యాంకర్లు, లారీ కాంట్రాక్టులు గిరిజనేతరులకు కేటాయించడం తక్షణమే రద్దు చేసి వంద శాతం గిరిజనులకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వజ్జా శ్యామ్, జేఏసీ కోఆర్డినేటర్ మడి శంకర్, సెక్రటరీ బొగ్గం రమేష్, ట్రెజరర్ గొట్టం ఝాన్సీ, మాజీ సర్పంచ్ తిరుపతమ్మ, గోపాల్, మడి స్వరూప, అలంకోటి వరస, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య విద్యాలయంలో ముందస్తు దీపావళి వేడుకలు

**సత్తుపల్లి,మహా:** పట్టణ పరిధిలోని శ్రీ చైతన్య పార్య ప్రణాళిక పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు, దీపాలతో పాఠశాలను అలంకరించారు.ఈ సందర్భంగా దీపావళి ప్రాముఖ్యతను పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు వివరిస్తూ చెడుపై మంచి గెలిచిన రోజుని వెలుగుల పండుగ దీపావళిగా అభివర్ణించారని,భారతదేశ సంస్కృతి సంప్రదాయాన్ని గౌరవిస్తూ పండుగలను ఆచరించాలని టపాసులు పేల్చక్రమంలో పిల్లలు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్,డీన్, ఇంచార్జ్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జర్నలిస్టులపై అక్రమ కేసులు అరికట్టాలి

**సత్తుపల్లి,అక్టోబర్ 17: మహా:** పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయటం దురదృష్టకరని,సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై వరుసగా ఏపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం గర్హనీయమని జర్నలిస్టులు ముక్తకంఠతో ఖండించారు.సత్తుపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఎడిటర్ పై అక్రమ కేసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జర్నలిస్ట్ సంఘాల బాధ్యులు తోటకిరణ్(టీయూడబ్ల్యూజే- టీజేఎఫ్) చినేని బాలకృష్ణ( టీయూడబ్ల్యూజేఎఫ్),తడికమళ్ళ దేవా(టీయూడబ్ల్యూజే-ఐజేయూ) మాట్లాడుతూ ప్రభుత్వాలు జర్నలిస్టులపై దమనకాండ పత్రికా స్వేచ్ఛను హరించటమేనని మండిపడ్డారు.జర్నలిస్టు సంఘాల ఐక్యతతోనే ప్రభుత్వాల నియంతృత్వకడలను అడ్డుకోవచ్చున్నారు.బీసి సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ వరపు శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు,సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు దండు ఆదినారాయణ సిపిఎం పట్టణ కార్యదర్శి సర్వేశ్వరరావు మాస్ లైన్ భాద్యులు అమర్లపూడి శరత్,మసీదు కమిటీ సెక్రటరీ ఎండీ కమల్ పాష ,మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి మల్లికార్జున్ ఎమ్మార్పీఎస్ శ్రీనివాసరావు.లయన్స్ అధ్యక్షుడు రవి, వడ్డెర సంఘం జమలయ్య,లంబాడి హక్కుల సంఘం నందు నాయక్ సంఘీభావం తెలిపారు ఈ కార్యక్రమంలో జర్నలిస్టు మిత్రులు ఎండీ షైబుద్దీన్, భీమిశెట్టి రఘురామారావు, ఎస్కే ఖాదర్ బాబా, బి.వి.రామారావు,జిడిమళ్ళ శ్రీనివాసరావు, కొవ్వూరు సాంబశివరావు, బొర్ర కోటేశ్వరరావు, గోపరాజు గోపి, నర్రా అరుణ్,,బాబు,రావిశెట్టి లక్ష్మణరావు శ్రీకాంత్, ఐ శ్రీనివాసరావు , సతీష్,ఎస్ కే మీరా, బాజీ, సురేష్, మహ శ్రీనివాస్, తడికమళ్ళ అప్పారావు,గురవయ్య, కొత్తపల్లి సుధాకర్, చీపుగంగాధర్,ఓబిలినేని రామారావు,కాకర్ల జగన్, ఎస్కేమునీర్,బల్లెం చిరంజీవి, జంగం కిరణ్,మారోజు అశోక్,ఎండీ మేరాజ్ పాల్గొన్నారు.



# ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు

### నాణ్యతతో వసతి గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

### ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు సరఫరా లక్ష్యం

- నగరంలో త్రాగునీటి పనులకు 220 కోట్లు మంజూరు
- ప్రజల అంగీకారంతోనే రోడ్డు వెడల్పు పనులు
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ మంత్రి తుమ్మల



**ఖమ్మం,మహా:** ఖమ్మం నగరంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. మంత్రివర్యులు, శుక్రవారం స్థానిక ముస్తఫా నగర్ లో 3 కోట్ల రూపాయలతో నిర్మించనున్న బీసీ బాలుర వసతి గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ముస్తాఫా నగర్ లో బీసి వసతి గృహం కోసం నూతన భవన నిర్మాణానికి మూడు కోట్లు మంజూరు చేశామని అన్నారు. ఖమ్మం నగరంలో పాతబడి కూలిపోయే స్థితిలో ఉన్న 3 సంక్షేమ హాస్టల్స్ నిర్మాణానికి ప్రభుత్వం మొత్తం 9 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. ఈ హాస్టల్స్ నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో చేపట్టాలని, భవిష్యత్తులో పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజల అంగీకారం ఉంటే బోనకల్ రోడ్డు వెడల్పు చేస్తామని అన్నారు. రోడ్డు వెడల్పు జరిగితేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. ప్రజలు ప్లాస్టిక్, చెత్తను రోడ్లు, మురికి కాల్వలలో వేయవద్దని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోకపోతే రోగాల బారిన పడి డబ్బులు అనవసరంగా ఆసుపత్రిలో ఖర్చు అవుతాయని అన్నారు. ఖమ్మం నగరంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని త్వరలో త్రాగునీటి సౌకర్యం కల్పన కోసం మరో 220 కోట్లు మంజూరు చేస్తామని అన్నారు. రాబోయే వేసవి కాలంలో ఎక్కడ ఖమ్మంలో మంచినీటి సమస్య ఉండటానికి వీలు లేదని, ప్రతి ఒక్కరికి శుద్ధమైన త్రాగు నీరు అందాలని అన్నారు. మనం కష్టపడి సంపాదించిన డబ్బులు పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు పెట్టాలని, అనవసరంగా ఆసుపత్రుల పాలు చేయవద్దని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు, స్వామి నారాయణ స్కూల్ కూడా త్వరలో రాబోతున్నాయని అన్నారు. పేద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ముఖ్యమంత్రి గురుకులాల్లో డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచడం జరిగిందని అన్నారు. నగరంలో రోడ్డు వెడల్పు పనులకు ప్రజలు సహకరించాలని, పావలా నష్టపోతే ప్రజలకు రూపాయి వరకు పరిహారం అందిస్తూ ఆదుకుంటున్నామని మంత్రి తెలిపారు. జ్యోతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఇఇ లు రంజిత్, కృష్ణలాల్, మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమీషనర్ అనిల్ కుమార్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మిరాకిల్ మైండ్స్ పాఠశాల విద్యార్థుల క్షేత్ర పరిశీలన

**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని మిరాకిల్ మైండ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ప్రాథమిక విద్యను ప్రారంభించిన (యూ.కే.జీ) విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం క్షేత్ర పరిశీలన కార్యక్రమం ఏర్పాటు చేశారు.అధ్యాపక బృందం చిన్నారి విద్యార్థులను ప్రభుత్వ కార్యాలయాలు సందర్శింపజేసి అధికారుల విధులను వివరించారు. విద్యతోపాటు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలకు ఏ అధికారిని సంప్రదించాలి అనే విషయంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రత్నాకర్ మాట్లాడుతూ మీరాకిల్ మైండ్స్ విద్యార్థులను విద్యతోపాటు అన్ని రంగాల్లో ప్రథమలుగా తీర్చిదిద్దరమే ఉద్దేశంగా పెట్టుకున్నామని దానిని సాధించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.


## ఏరుగట్ల డబల్ బెడ్ రూమ్ బాధితులకు న్యాయం చేయండి.

**ఖమ్మం, మహా:** సత్తుపల్లి నియోజకవర్గం, పెనుబల్లి మండలం, ఏరుగట్ల గ్రామంలో డబుల్ బెడ్రూమ్ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న అక్రమాలపై భారతీయ జనతా పార్టీ నాయకులు గళమెత్తారు. శుక్రవారం ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీ అనుదీప్ దురిశెట్టి, జాయింట్ కలెక్టర్ పీ. శ్రీనివాస రెడ్డికి ఫిర్యాదు చేశారు. బీజేపీ బృందం విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సానుకూలంగా స్పందించి, బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్రూమ్స్ కోసం ఎవరైతే తమ స్థలాలను ఇచ్చారో, ఆ 15 మందికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ డబుల్ బెడ్రూమ్స్ కేటాయిస్తామని తెలిపారు. మిగిలిన ఇళ్లు కూడా కేవలం అర్హులైన లబ్ధిదారులకే అందజేస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, జిల్లాలో ఎక్కడైనా అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు తేలితే, వాటిని వెంటనే రద్దుచేసి, అర్హులకు కేటాయిస్తామని కలెక్టర్ బీజేపీ బృందానికి హామీ ఇచ్చారు.

# మందులకంటే మనసే ఔషధం

- వైద్యంలో విప్లవం సృష్టించిన వైద్యదేవుడు
- రోగి కన్నీటికి ప్రాణం పెట్టిన మనిషి
- రెహాబ్ బుద్ధా .. నిస్సహాయులకి నూతన జీవం
- సేవే శ్రద్ధ, వైద్యం ఆయన వ్రతం!
- వైద్యంలో మానవత్వం .. ఖమ్మం గర్వించదగిన వైద్యదేవుడు
- (డా. గోంగూర వెంకటేశ్వర్లు జీవన-సేవా గాథ)

**ఖమ్మం బ్యూరో, మహా:** వైద్యం అంటే కేవలం రోగాన్ని నయం చేయడం కాదు, అంతకుమించి, జీవితంపై ఆశను నింపి, మనసును తడిమి ఆత్మవిశ్వాసాన్ని మళ్లీ వెలిగించడం. ఆ భావనను తన జీవితం ద్వారా సజీవంగా నిరూపించిన మహనీయులు డా. గోంగూర వెంకటేశ్వర్లు (డా. జీవీ). ఖమ్మం ప్రజల హృదయాలలో కేవలం వైద్యుడిగా కాక, విశ్వాసపు ప్రతీకగా నిలిచిన ఈ మహనీయుడు. పేషెంట్ అంటే కేవలం కేస్ నంబర్ కాదని, అది ఒక జీవితం, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు అని చూపించారు. అనారోగ్యంతో కన్నీరు మున్నీరు అవుతున్న వ్యక్తికి ధైర్యం చెప్పే మాటలు, నొప్పిని తగ్గించే స్వాంతన స్పర్శ, భయాన్ని తొలగించే చిరునవ్వు .. ఇవన్నీ డాక్టర్ జీవీ వ్యక్తిత్వంలోని ఆత్మస్వరూపాలు. ఆయన చేతుల చికిత్స కంటే, ఆయన మనసు చేసే మంత్రం గొప్పది. ఆయన దగ్గర వైద్యం మొదలయ్యేది మందుల చీటీతో కాదు, మానవత్వపు కౌగిలితో. "రోగి ప్రాణం నా ప్రమాణం" అన్నదే ఆయన నమ్మకం. అర్ధరాత్రి అయినా, పండుగ రోజు అయినా పేషెంట్ ఫోన్ చేస్తే, ఒక్క క్షణం ఆలస్యం చేయని వైద్యసేవకుడు ఆయన. ఆయన తలుపు ఎప్పుడూ తెరిచే ఉంటుంది . అది కేవలం ఆసుపత్రి తలుపు కాదు, భరోసా తలుపు. డా. జీవీకి వైద్యం అంటే వృత్తి కాదు . పుణ్యకార్యం.




సమాజం అనే కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలన్న తపనతో ఆయన నడిపే జీవనయానం 'సేవ' అనే పదానికి సరికొత్త, హృదయపూర్వక అర్థం ఇచ్చింది. డా. గోంగూర వెంకటేశ్వర్లు పేరే ఖమ్మంలో ఒక అచంచలమైన విశ్వాసం. ఎన్ని సంవత్సరాలు గడిచినా, ఎన్ని తరాలు మారినా ఆయన సేవా ఉత్సాహం, ఆప్యాయత తగ్గలేదు. సాంకేతికత మారింది, ప్రపంచం వేగం పెరిగింది, కానీ ఆయన వైద్య తపన మాత్రం ఇంకా అదే. పేషెంట్ పిలిస్తే పండుగా, సెలవా అన్న తేడా లేకుండా స్పందించే మనస్తత్వం ఆయనది. ఆ నిస్వార్థ ప్రేమతోనే ఆయన స్థాపించిన "శ్రీరక్ష హాస్పిటల్" ఇప్పుడు ఆరోగ్యానికి కేవలం చికిత్సా కేంద్రం కాదు.. భద్రతకు మరో పేరుగా నిలిచింది. ప్రతీ రోగి దగ్గర ఆయనకు కనబడేది కేవలం రోగం లేదా నొప్పి కాదు, జీవితంపై ఆశ. "వైద్యం అనేది కేవలం శరీర నయం కాదు, అంతకంటే ముందు మనసు నయం కావాలి" అన్నదే ఆయన తత్వం. అందుకే ఆయన వద్ద చికిత్స తీసుకున్నవారు, శక్తివంతమైన మందులతో పాటు, బలమైన ధైర్యం కూడా తీసుకెళ్తారు. రోగి వెనుక నిలిచిన కుటుంబం భయపడకుండా, కుంగిపోకుండా నిలబడేందుకు ఆయన పలికే మాటే వారికి మొదటి ఔషధం. ఆయన సేవలో ఉన్న శ్రద్ధ, దయ, నిబద్ధత ఆయనను సాక్షాత్తు వైద్యదేవుడిగా మార్చాయి.

## రెహాబ్ బుద్ధా .. విరిగిన జీవితాలకు కొత్త బలం

జీవితంలో ప్రమాదం, భయంకరమైన వ్యాధి లేదా నిస్సహాయత ఎవరినైనా కుదిపేస్తుంది. అటువంటి చీకటి క్షణాల్లో మళ్లీ నిలబడే ధైర్యం, శక్తి ఇచ్చే పునరుజ్జీవన కేంద్రమే 'రెహాబ్ బుద్ధా'. ఇది కేవలం పునరావాస కేంద్రం కాదు , నిస్పృహలో ఉన్నవారికి కొత్త ఆశను నేర్పే ఆలయం. డా. జీవీ చేత స్థాపించబడిన ఈ కేంద్రం "శ్వాస ఆగినా ఆశ ఆగకూడదు" అనే మహోన్నత నమ్మకంతో నడుస్తోంది.ఇక్కడ వైద్యం అంటే మాత్రలు ఇవ్వడం కాదు, మనసును, ఆత్మను బలపరచడం. గాయపడిన శరీరం మాత్రమే కాదు, కుంగిపోయిన మనసును కూడా తిరిగి లేవదీయడం ఇక్కడి లక్ష్యం. పక్షవాతం, నరాల సమస్యలు, తీవ్ర ప్రమాదాల నుండి కోలుకుంటున్న రోగి .. చేతి కదలిక మళ్లీ మొదలై, కాళ్లు మరోసారి నడక నేర్చుకున్నప్పుడు డా. జీవీ కన్నుల్లో కనిపించే ఆనందం . అది దేవుడి ఆనందం. రెహాబ్ బుద్ధా వైద్యానికి మించి మానవత్వం పూస్తున్న పుణ్యస్థలిగా నిలిచింది.

## టెక్నాలజీతో సేవా తత్వం

డా. జీవీ సమయాన్ని, అవసరాన్ని ముందే చూడగలిగిన దార్శనికుడు. వైద్య సేవలు దూరం కాదు, ప్రతి ఇంటి తలుపు దగ్గర ఉండాలని ఆయన దృఢ సంకల్పం. అందుకే ఆయన ప్రారంభించిన "శ్రీరక్ష హెూమ్ కేర్ సర్వీసెస్" ద్వారా ఇప్పుడు ప్రతి కుటుంబం ఇంట్లోనే సులభంగా అత్యుత్తమ వైద్య సదుపాయాలు పొందగలుగుతోంది. టెలిమెడిసిన్, అధునాతన ఫిజియోథెరపీ, అత్యవసర అంబులెన్స్ సేవలు, రక్తదాతల సాయం.. ఇవన్నీ ఒకే వేదికలో, ఒకే ఫోన్ కాల్‌తో అందుబాటులోకి తెచ్చారు. ప్రాణాలను కోల్పోతున్న వారికి, లేదా ఆసుపత్రికి రాలేని వృద్ధులకు ఒక ఒక్క కాల్‌తో అందే నిరంతర సేవ, ఇది ఆయన కలను నిజం చేసిన మరో మానవీయ అధ్యాయం. సాంకేతికతను మానవత్వంతో కలిపి ప్రజలకు అందించే ఈ అద్భుతమైన ఆలోచన నిజంగా వైద్యరంగంలో ఒక విప్లవం. ఖమ్మం గర్వకారణంగా ఈ సేవలు రాష్టానికే ఆదర్శంగా నిలిచాయి.

## కార్మికుల సంక్షేమ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దు

**కొత్తగూడెం టౌన్, మహా:** కార్మికుల సంక్షేమ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని ఉద్యోగులకు సంబంధించి టెర్మినల్ బెనిఫిట్స్ ను త్వరితగతిన పూర్తి చేయాలని డిజిఎం(పర్సనల్)వెల్ఫేర్ కేసా నారాయణ రావు, ముకుంద సత్యనారాయణలు తెలిపారు. సింగరేణి సంస్థ డైరక్టర్(పా)గౌతమ్ పోట్రు ఆదేశాల మేరకు, జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్ సూచనల మేరకు శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో సింగరేణి కార్పొరేట్ పరిధిలోని అన్ని డిపార్ట్మెంట్ ల టెర్మినల్ బెనిఫిట్స్ కు సంబందించిన క్లర్కులతో డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ లు కేసా నారాయణ రావు, ముకుంద సత్యనారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు.

## బీసీ బిల్లుకు బిజెపి మోకాళ్ల అడ్డు



**కారేపల్లి , మహా:** బీసీ 42శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం అడ్డకోవటాన్ని నిరసిస్తూ శుక్రవారం సీపీఐ(ఎం) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్రనిరసించారతీరును నిరసించారు. ఈ సందర్భంగా తలారి దేవ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ 42 శాతం బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటుందని జనగణన పూర్తి చేసి బీసీ కులాల జనాభాసంఖ్యకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం ప్రవేశపెట్టిందని అందుకు బిఆర్ఎస్ బిజెపి అన్ని పక్షాలు ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు గవర్నర్ ఆమోదం పెండింగ్లో పెట్టి అటు కేంద్ర ప్రభుత్వం బిందువుని పాస్ చేయకుండా ఉద్దేశపూర్వకంగానే ఆప్ చేసి అందుకు తమ కారణం కాదన్నట్లు నటిస్తుందని గవర్నర్లు కేంద్ర బిజెపి ప్రభుత్వ వాదులుగావ అపవాదించ పడుతున్నారని బిజెపికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణం 42% బిసి రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా మారావు. కొండబోయిన ఉమావతి. శాఖ కార్యదర్శి అన్నవరపు కృష్ణ నాయకులు ముక్కా సీతారాములు. కర్కపల్లి రాయమల్లు.అరెల్లి శ్రీరాములు.వెంకన్న.రవి. తదితరులు పాల్గొన్నారు.

## నేడు కారేపల్లి క్రాస్ రోడ్‌లో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ లో కారేపల్లి ,కామేపల్లి మండలాలు చెందిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఐ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుచ్చకాయల శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే ఈ కౌన్సిల్ సమావేశం పుచ్చకాయల శ్రీనివాసరావు అధ్యక్షతన, ఆయన నివాస గృహంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## రేపుటి బిసి బంద్ కు కాంగ్రెస్ పార్టీ మద్దతు



**బోనకల్లు మహా:** బోనకల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు రేపు బీసీ సంఘాల బందులో పాల్గొని విజయవంతం చేయాలి. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ, బిజెపి పార్టీ నిరంకుశ వైఖరికి నిరసనగా బిసి సంఘాలు రేపు తెలంగాణ రాష్ట్ర బంద్ పిలుపునిచ్చారు. రేపటి తెలంగాణ బంద్ కు కాంగ్రెస్ పార్టీ తరపున గౌరవ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంపూర్ణ మద్దతు తెలిపారు. కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉదయం 9:00 గంటలకు మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని బంద్ ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ బోనకల్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు పిలుపునిచ్చారు.

## రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామంలోని ప్యాడీ ప్రొక్యూర్మెంట్ సెంటర్ ను జిల్లా పౌర సరఫరా అధికారి, చెకింగ్ ఇన్స్పెక్టర్లు సత్తుపల్లి, వైరా వారు కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరా అధికారి మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 327 పిపిసి సెంటర్లు ఉన్నాయని, వాటిలో మొదటగా కల్లూరు మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో సెంటర్ ప్రారంభమైందని తెలిపారు. అధికారి మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సెంటర్లలో టెంట్, కుర్చీలు, త్రాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్ వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులను ముందుగానే హెచ్చరించాలని, తార్పాలిన్లు మరియు గన్ని సంచులు సకాలంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు.

# సిజె జస్టిస్ గవాయిపై దాడి రాజ్యాంగంపై దాడే

**మణుగూరులో నల్ల బ్యాడ్జీలతో ఎమ్మార్పీఎస్ నిరసన..**




**మణుగూరు, మహా :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిజె ఏసి గవాయిపై చేసిన దాడి రాజ్యాంగం పైన చేసిన దాడియేనని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు మణుగూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గవాయిపై దాడి అనేది వ్యక్తిగత దాడి కాదు, అది భారత రాజ్యాంగంపై దాడి అని, రాజ్యాంగ విలువలను కాపాడే ప్రతి పౌరుడు ఈ ఘటనను ఖండించాలని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొమ్ము హుస్సేన్ మాదిగ, చిట్యాల రజిత మాదిగ, ఉసికల కొండయ్య మాదిగ, బొమ్మెర వెంకన్న మాదిగ, అఖిల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# యాంత్రీకరణ కొరకు దరఖాస్తు చేసుకోండి



**నేలకొండపల్లి,మహా:** వ్యవసాయ యాంత్రీకరణ పథకం కు రైతులు దరఖాస్తు చేసుకోవాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ సూచించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు... మండలం లోని రైతాంగం కు సబ్సిడీ పై యాంత్రీకరణ పనిముట్ల ను అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు దరఖాస్తులు అందించాలని కోరారు. మండలం కు మ్యానువ్యల్ స్ప్రేయర్స్, బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, పవర్ టిల్లర్, బ్రష్ కట్టర్ మరియు పవర్ వీడర్ లు మంజూరైనట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆధార్కార్డు జిరాక్స్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, రైతు పాస్పోర్టు ఫోటోలు-2 లతో దరఖాస్తులను స్థానిక ఏఈవో లకు 'అందించాలని కోరారు.

# బీసీలను మరో మారు మోసం చేసే కుట్ర



**నేలకొండపల్లి, మహా :** బీసీలను రిజర్వేషన్ పేరుతో ప్రభుత్వం మరోమారు కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ హామీ న్యాయస్థానాల పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ మోసం ను బీసీలు గమనించాలని సూచించారు. విద్యా, ఉద్యోగాలు, పదోన్నతులు, స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టసభలలో రిజర్వేషన్ సాధనలో తాము పాలుపంచకుంటుమని పేర్కొన్నారు. శనివారం బీసీ సంఘాలు తలపెట్టిన తెలంగాణ బంద్ కు పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా బంద్ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో సొసైటీ చైర్మన్ లు నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదారెడ్డి, షేక్ హుస్సేన్, మరికంటి రేణుబాబు, మాదాసు ఆదాం, కమదన ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల పక్షపాతి కృష్ణయ్య



**నేలకొండపల్లి, మహా:** నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోరకు శ్రమించిన ప్రజల పక్షపాతి కర్నాటి కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాజీ శాసనసభ్యులు కర్నాటి కృష్ణయ్య 27 వ వర్ధంతి ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...నిస్వార్ధ కమ్యూనిస్టు యోధుడు అన్నారు. తెలంగాణ రైతాంగం ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. నైజాం ప్రభుత్వం కు వ్యతిరేకంగా ప్రజా కోర్టులు నిర్వహించిన ప్రజల పక్షాన పోరాడిన వీరుడు అన్నారు. నైజాం ప్రభుత్వ కు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం ను కలిగించారని పేర్కొన్నారు. ఆయన బాటలోనే ఆయన కుటుంబం కూడ ఆయన ఆశయ సాధన కోసం ముందుకు సాగుతుండటం అభినందనీయం అన్నారు. మహానీయుల ఆశయ సాధన కోసం క్షేత్ర స్థాయిలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ కంట్రోల్ కమీషన్ చైర్మన్ మౌలానా, జాతీయ నాయకులు భాగం హేమంతరావు, కనకబండి సీతారాములు, మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు వున్నం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ములకలపల్లి మృత్యు వారధి

- ప్రాణాలతో పందెం కడుతున్న పాలేరు ప్రజలు!
- బ్రిడ్జి కూలి ఏడాదైనా నిర్మాణం చేపట్టని ప్రభుత్వం
- తాత్కాలిక బ్రిడ్జిపై బిక్కుబిక్కుమంటున్న ప్రయాణం
- గ్రానైట్ లారీల బరువుకు వణికిపోతున్న వంతెన
- సీఎం హామీతో ఆవిరైన వారధి



**ఖమ్మం బ్యూరో, మహా:** ఖమ్మం-మహబూబాబాద్ జిల్లాలను అనుసంధానించే ములకలపల్లి వారధి, పాలేరు ప్రాంత ప్రజలకు ముఖ్యమైన జీవనాధారం. గత సంవత్సరం వచ్చిన పెను వరదలకు ధ్వంసమైన ఈ కీలక వంతెన స్థానంలో, ప్రభుత్వం హడావుడిగా తాత్కాలిక వారధిని నిర్మించి తాత్కాలిక ఉపశమనం కల్పించింది. 'తక్షణమే కొత్త బ్రిడ్జి నిర్మిస్తాం' అని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ కూడా ఈ ఎండల్లో ఆవిరైపోయింది. ఏడాది గడుస్తున్నా పునర్నిర్మాణం పనులు మొదలు కాకపోగా, ప్రమాదకరంగా మారిన ఆ తాత్కాలిక వంతెనపైనే గ్రానైట్ లారీలు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నాయి. చీలిపోతున్న సిమెంట్ ప్లేట్లు, బయటకు కనిపిస్తున్న ఇనుప రాడ్ల మధ్య గ్రామస్తులు, గర్భిణీలు, వృద్ధులు భయంతో ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది.

## ప్రజల ప్రాణాలపై నిర్లక్ష్యం

ఖమ్మం-మహబూబాబాద్ ప్రధాన రహదారిని కలిపే ములకలపల్లి వారధి (బ్రిడ్జి) పాలేరు ప్రజలకు కేవలం రహదారి కాదు, అది వారి జీవనాధారం. వాణిజ్యం, విద్య, వైద్యం కోసం రెండు జిల్లాల మధ్య రాకపోకలు ఈ వారధిపైనే ఆధారపడి ఉన్నాయి. గత సంవత్సరం వచ్చిన పెను వరదలు ఈ వంతెనను ధ్వంసం చేశాయి. అప్పుడు అధికారులు హడావుడిగా తాత్కాలిక వారధిని నిర్మించి చేతులు దులుపుకున్నారు. ఆ తాత్కాలిక ఉపశమనమే ఇప్పుడు మరణదారిగా మారుతోంది.

## ముఖ్యమంత్రి హామీ గాలిలో

వరదలు వచ్చిన సందర్భంగా ప్రాంతాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "తక్షణమే కొత్త బ్రిడ్జి నిర్మిస్తాం" అని హామీ ఇచ్చారు. అయితే, ఆ వాగ్దానం ఇప్పుడు ఎండలో ఆవిరైపోయిన మేఘంలా మారింది. ముఖ్యమంత్రి హామీ ఇచ్చి సంవత్సరం దాటినా, కనీసం ఒక్క ఇటుక కూడా వేసిన దాఖలాలు లేవు. దీనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రమాదంలో ప్రాణాలు

ప్రస్తుతం వినియోగంలో ఉన్న తాత్కాలిక వారధి అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది. ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాలు, ముఖ్యంగా గ్రానైట్ లారీలు, ఈ వారధిపై దూసుకుపోతున్నాయి. వాటి భారీ బరువును తట్టుకోలేక బ్రిడ్జిపై వేసిన సిమెంట్ ప్లేట్లు కదులుతున్నాయి, ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి. రాత్రివేళ లైట్లు లేక చీకట్లో ప్రయాణం మరింత భయానకంగా మారింది. గర్భిణీలు, పిల్లలు, వృద్ధులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రతిరోజూ ఈ వంతెనపై నడవాల్సి వస్తోంది.

## ప్రజల ప్రాణాల కంటే లాభాలే ముఖ్యమాలి

ప్రజలు పలుమార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి నూతన వారధి నిర్మాణం ప్రారంభించాలని, కనీసం గ్రానైట్ లారీల రాకపోకలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ, ఎటువంటి స్పందనా లేదు. దీనికి కారణం అధికారులు, కాంట్రాక్టర్లు, లారీ యజమానుల మధ్య ఉన్న 'లాభపంపిణీ' సంబంధమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్లక్ష్యం కారణంగా పాలేరు ప్రాణధార వంతెన క్షీణించడం ప్రభుత్వ పాలనపై, ప్రజల భద్రతపై ప్రశ్నార్థక చిహ్నాన్ని సృష్టిస్తోంది.

## తక్షణ చర్యలు అవసరం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, రవాణా శాఖ అధికారులు తక్షణమే స్పందించి నూతన వారధి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించకపోతే, ములకలపల్లి వారధి ప్రాంతం మరో మానవనష్టం కేసుకు దారితీసే అవకాశం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. గతంలో పాలేరు ప్రాజెక్టును పర్యవేక్షించిన ప్రభుత్వం, ఇప్పుడు ఈ జీవనాధార వంతెన విషయంలో ఎందుకు మౌనం వహిస్తుందో ప్రజలకు అర్థం కావడం లేదు. ములకలపల్లి బ్రిడ్జి విషయంలో ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యానికి, వాగ్దానాల విస్మరణకు అద్దం పడుతోంది. సీఎం హామీ, అధికారుల మౌనం.. ఈ రెండూ ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీశాయి.

# కాంగ్రెస్ పటిష్టానికి వ్యూహరచన!

- డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై భట్టి, మహీరధన్ చర్చలు
- యువ నాయకత్వానికి ప్రాధాన్యమే లక్ష్యం
- పాత-కొత్త నేతల సమన్వయమే విజయమార్గం
- పార్టీ బలోపేతంపై ఏఐసీసీ పరిశీలకుడి దృష్టి

ఖమ్మం బ్యూరో, మహా: ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పునర్వ్యవస్థీకరణకు నూతన ఊపిరి పోసే ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. డీసీసీ అధ్యక్షుడి ఎంపికను దృష్టిలో ఉంచుకుని ఏఐసీసీ నియమించిన పరిశీలకుడు మహీరధన్ జిల్లా పర్యటనలో శుక్రవారం కీలక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు జిల్లా కాంగ్రెస్ కీలక నేతలతో సుదీర్ఘ చర్చలు సాగాయి. పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే ఈ సమావేశం, ఖమ్మం రాజకీయ వాతావరణానికి కొత్త ఉత్సాహాన్ని తెచ్చిందని చెప్పాలి. ప్రతి నియోజకవర్గ స్థాయిలో పార్టీ శక్తి, వర్గాల సమన్వయం, యువత పాత్ర, నూతన నాయకత్వం వంటి అంశాలు విశ్లేషణకు వస్తూ, కాంగ్రెస్ పునరుజ్జీవన యాత్రలో ఇది ముఖ్య ఘట్టంగా నిలిచిందిి ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా జిల్లా రాజకీయ సమీకరణాలపై లోతైన అవగాహన పొందేందుకు ఏఐసీసీ నియమించిన పరిశీలకుడు మహీరధన్ పర్యటన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో



ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ని కలిశారు. ఈ సమావేశంలో జిల్లాలో పార్టీ కార్యకలాపాల పురోగతి, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, నాయకత్వ సమతౌల్యం, యువతకు అవకాశాలు, వర్గీయ సమీకరణాలపై సమగ్ర చర్చ జరిగింది. మహీరధన్ గారు ఇటీవల జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ, ప్రతి నియోజకవర్గంలోని పార్టీ శక్తి స్థితిని తెలుసుకున్నారు. ప్రతి మండలం, పట్టణ కాంగ్రెస్ కమిటీ కార్యకలాపాలపై వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఖమ్మం కాంగ్రెస్‌కు గౌరవప్రదమైన చరిత్ర ఉంది. పాత, కొత్త నాయకుల సమన్వయంతో పార్టీ బలపడాలి. అన్ని వర్గాలను కలుపుకునే విధంగా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక జరగాలి. సీనియర్ల అనుభవం, యువత ఉత్సాహం కలిసి పార్టీకి కొత్త దిశ చూపగలవు అని అన్నారు. తరువాత పరిశీలకుడు మహీరధన్ జిల్లా నాయకులతో కూడా ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించారు. ప్రతి నేతకు తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరచుకునే అవకాశం కల్పించారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# తోటి కార్మికుడికి సింగరేణి ఉద్యోగుల ఔదార్యం

మణుగూరు, మహా: తోటి ఉద్యోగి ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అండగా నిలవడమే మానవత్వానికి నిజమైన ప్రతీక అని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఉద్యోగులు మరోసారి నిరూపించారు. మణుగూరు ఏరియా పీకే ఓసీ డంపర్ సెక్షన్‌లో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మడి రామారావు కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య పరంగా సింగరేణి సంస్థ సహకారం అందిస్తున్నప్పటికీ, ఇతర ఖర్చుల భారం ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. శుక్రవారం నాడు డంపర్ సెక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో రామారావు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.75 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్మిక నాయకుడు వూకంటి ప్రభాకర్‌రావు ఈ సందర్భంగా



మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగులు ఎల్లప్పుడూ మానవతా సేవలో ముందుం టా న్నారు. తోటి కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, గ్రామీణ ప్రజలు, నిరుపేద విద్యా ర్థులు, విపత్తుల బాధితులందరికీ అండగా నిలవడంలో వీరి స్ఫూర్తి అభినందనీయమైనదని పేర్కొన్నారు.

# తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు



నేలకొండపల్లి, మహా : పంచాయతీ కార్యదర్శుల ను బెదిరిస్తూ...బ్లాక్ మెయిల్ చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం డిమాండ్ చే శారు. మండలం లోని చెన్నారం పంచాయతీ కార్యదర్శి ని డబ్బుల కోసం వేధించారని..ఇవ్వకపోవటంతో సోషల్ మీడియా లో అసత్య ప్రచారం చేసి....మనోవేదన కు గురి చేశారని శుక్రవారం కార్యదర్శులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ను ఎంపీడీఓ కు అందించారు. సదరు వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడారు... వారి స్వార్థం కోసం కార్యదర్శులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే వారి పై చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళన "చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులసంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాన్ షాపుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు..



మణుగూరు, మహా: డ్రగ్స్ నిర్మూలన యుద్ధంలో భాగంగా శుక్రవారం మణుగూరు పట్టణంలో పాన్ షాపులలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. డిఎస్పి రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు ఇ బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో మణుగూరు పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారా లేదా అనే కోణంలో ప్రతి దుకాణాన్ని పరిశీలించారు. అక్రమ వ్యాపారాల్లో నిమగ్నమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. డ్రగ్స్ వ్యసనం సమాజాన్ని నాశనం చేస్తోందని, ప్రజల సహకారంతోనే దానిని అరికట్టగలమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్పెషల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటాం: మంత్రి తుమ్మల



అశ్వారావుపేట, మహా: అశ్వారా వుపేట మండల కేంద్రంలోని ఫామ్ ఆయిల్ గెస్ట్ హౌస్‌లో శు క్రవారం పామాయిల్ నర్సరీలో విత్తనాలు నాటడం, రైతులతో ముఖాముఖి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ పామాయిల్ సాగులో కనిపించే వ్యాధులు రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని, దాన్ని సమూలంగా నిర్మూలించాలంటే విత్తన దశలోనే చర్యలు తీసుకోవాలని సూచించారు. మలేషియా, ఇండోనేషియా దేశాల్లో అమలు చేస్తున్న ఆధునిక పద్ధతులను తెలంగాణలో కూడా అవలంబిస్తున్నామని తెలిపారు. తెలంగాణ వాతావరణం పామాయిల్ సాగుకు అత్యంత అనుకూలమని తుమ్మల పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల వరకు పామాయిల్ సాగు చేయవచ్చని, అందులో కనీసం 10 లక్షల ఎకరాల సాగు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని తెలిపారు. పత్తి, మొక్కజొన్న వంటి సాంప్రదాయ పంటలతో రైతులు నష్టపోయారని, పామాయిల్ సాగు రైతులకు లాభదాయకమని వివరించారు. అశ్వారావుపేట ఓ మోడల్‌గా నిలిచి, రాష్ట్రవ్యాప్తంగా పామాయిల్ పరిశ్రమలకు దిశానిర్దేశం చేస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆయిల్‌ఫెడ్ నర్సరీల ద్వారా నాణ్యమైన హైబ్రిడ్ మొక్కలు, విత్తనాలు రైతులకు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని చెప్పారు. సిద్ధిపేటలో రాష్ట్రవ్యాప్తంగా పండించే పామాయిల్ పంటను క్రష్ చేసే సామర్థ్యం కలిగిన ఫ్యాక్టరీ ఇప్పటికే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, సత్తుపల్లి శాసనసభ్యులు రాగమయి, ఆయిల్‌ఫెడ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### ఆయిల్‌ఫెడ్ నర్సరీలతో నాణ్యమైన విత్తనాలు రైతుల చేతికి

రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల ద్వారా నాణ్యమైన హైబ్రిడ్ పామాయిల్ మొక్కలు రైతులకు అందిస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో పెంచిన విత్తనాలు వ్యాధినిరోధక లక్షణాలు కలిగి ఉండటం వల్ల దిగుబడి పెరుగుతుందని అధికారులు తెలిపారు. ప్రతి రైతు సాంకేతిక పద్ధతులను నేర్చుకుని పంటను లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు.



## గవాయపై దాడికి నిరసిస్తూ ధర్నా

**ముదిగొండ,మహా:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయపై జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్లజెండాలతో శుక్రవారం తాహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయపై దాడి చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.సిపిఐ(ఎం),బిఆర్ఎస్ పార్టీలు ధర్నాకు మద్దతు తెలిపాయి.ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి ఎల్ బద్రం మాదిగ,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొడ్డు అనిల్ మాదిగ,ఎంఎస్పి మండల అధ్యక్షులు పడిశాల నాగేశ్వరరావు మాదిగ, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం నాయకులు టీఎస్ కళ్యాణ్,వేల్పుల భద్రయ్య,కట్టకూరి ఉపేందర్,మెట్టెల సతీష్,బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు బంక మల్లయ్య,ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దపొంగు రామకృష్ణ పాల్గొన్నారు.

## కలంపై ఆంక్షలు ఉపసంహరించుకున్న ఆయిల్ ఫెడ్

**దమ్మపేట , మహా:** తెలంగాణా ఆయిల్ ఫెడ్ ఎండి శంకరయ్య ఈ నెల 4వ తేదిన జారీ చేసిన ఉత్తర్వులను సవరిస్తూ ,దానిని ఉపసంహరించుకుంటూ నేడు శుక్రవారం మరొక ఉత్తర్వులు జారీ చేశారు. 4 వ తేదీన జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం తెలంగాణా ఆయిల్ ఫెడ్ సంస్థలలోకి ,నర్సరీలకు ,ఫ్యాక్టరీ లలోకి సంబందిత ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా లు , ఇతరత్రా రైతు సంఘాలు ,ప్రజా సంఘాల వంటి వాటికి అనుమతులు నిరాకరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు , స్థానిక శాసన సభ్యులు జారె ఆదినారాయణ లు అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం పామాయిల్ నర్సరీ సందర్శనకు విచ్చేయనున్న క్రమంలో మీడియా కు అనుమతి లేనందున ఎవరూ అట్టి కార్యక్రమం వైపు చూడలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. వెంటనే తెలంగాణా ఆయిల్ ఫెడ్ ఎండి తాను జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంటూ తాజాగా మీడియా పై ఆంక్షలు ఎత్తివేస్తూ అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. దీంతో మీడియా నైతికంగా విజయం సాదించినట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## మత్తు పదార్థాల నివారణ అవగాహన



**అశ్వాపురం.మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలనుసారం మత్తు పదార్థాల వాడకంపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ, గంజాయి ఇతర మత్తు పదార్థాల విషయంపై ప్రజలు మౌనంగా ఉండకుండా నిశ్శబ్దాన్ని విడనాడాలని మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన చేపట్టే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని పాన్ షాపుల్లో అశ్వాపురం సిఐ జి అశోక్ రెడ్డి నేతృత్వంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాల బారిన పడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన కోరారు. ఈ సందర్భంగా మండల ప్రజానీకంతో చైతన్యం డ్రగ్స్ పై యుద్ధం అనే పోస్టర్ను విడుదల చేశారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

## పాన్ షాపుల పై పోలీసు తనిఖీలు



**దమ్మపేట, మహా :** మాధక ద్రవ్య రహిత మండలంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో , జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశానుసారం చేపట్టిన చైతన్యం కార్యక్రమంలో బాగంగా ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. మందలపల్లి లోని పలు పాన్ షాపులలో ఏదైనా మాధకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నాయా...? అనే అంశాలపై ఆరా తీశారు. ఎక్కడా ఎటువంటి అవాంచనీయ పరిస్థితి తులు లేక పోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా , కొనుగోలు చేసినా సమాచారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# కలప చోరీ





**జూలూరుపాడు, మహా:** మండల పరిధిలోని గుండెపుడి బీట్ పరిధిలో ఫారెస్ట్ జామాయిల్ ప్లాంటేషన్ లో విలువైన కలప చోరీకి గురవుతుంది. ఈ తతంగమంతా చాలా రోజుల క్రితం నుండే గుట్టు చప్పుడు కాకుండా జరుగుతుంది. ఈ క్రమంలో ఇది గమనించిన గ్రామస్తులు కొందరు విషయం బయట పెట్టడంతో కలప దొంగతనం తెలుగులోకి వచ్చింది. విషయం గమనించిన అటవీ అధికారులు హడావిడిగా కలపను సీజ్ చేసి, పై అధికారుల ఆదేశాల మేరకు అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలపడం విశేషం. వంట చెరుకునే పట్టుకొని కేసులు రాసే సంబంధిత అధికారులు, ఇంత తతంగం జరుగుతుంటే చూసి చూడనట్లు వ్యవహరించడం వెనక ఆంతర్యం ఏంటి.? జూలూరుపాడు అటభిశాఖ అధికారుల తీరు పై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరైతే కంచె చేను మేస్తుందని, దొంగలకే తాళాలు ఇచ్చినట్లు ఉందని బాహాటంగానే అటవీశాఖ అధికారులను విమర్శిస్తున్నారు. అదే విధంగా గత కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా మండల వ్యాప్తంగా అనేకచోట్ల వివిధ రకాల విలువైన చెట్లను నేలకూలుస్తూ వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. కానీ అటవీశాఖ అధికారులు తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ప్రజల అనుమానం నిజమేనేమో అనిపించక మానదు. ఇకనైనా జీవకోటికి ప్రాణాధారమైన అడవులను రక్షించి అటవి సంపదను అక్రమంగా కొల్లగొడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు అటవీశాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# కలిసొచ్చిన ముహూర్తం.!



**ఖమ్మం బ్యూరో, మహా:** తెలంగాణ రాష్ట్రంలో మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ ఈసారి రాజకీయ వేడిలోనూ వ్యాపార జోష్‌లోనూ కొనసాగుతోంది. దరఖాస్తు రుసుము భారీగా పెంచినా వెనక్కు తగ్గని వ్యాపారులు చివరి రోజుల్లో ఎక్సైజ్ కార్యాలయాలను కిక్కిరిసేలా చేశారు. రూ. మూడు లక్షల రుసుముతో కూడిన లైసెన్స్ పోటీలో అదృష్టం తమవైపు తిప్పుకునేందుకు వ్యాపారులు గడియలు, ముహూర్తాలు చూసుకుంటూ దరఖాస్తులు దాఖలు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ కార్యాలయాలు శుక్రవారం నాటికి బిజీ బజార్‌లా మారాయి. మూడు రోజులుగా మందకొడిగా సాగిన టెండర్ల ప్రక్రియ ఒక్కసారిగా వేగం పుంజుకోవడంతో అధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. గత లైసెన్స్ కాలంలో రూ.154 కోట్లు రాష్ట్ర ఖజానాకు అందించిన ఖమ్మం జిల్లా ఈసారి కూడా భారీ ఆదాయం అందించనున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. మద్యం షాపుల లైసెన్స్‌ల టెండర్ల ప్రక్రియ ఈసారి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చక్కటి జోష్‌తో సాగుతోంది. మొదట్లో మందకొడిగా కనిపించిన దరఖాస్తుల సమర్పణ ఇప్పుడు ఊపందుకుంది. శుక్రవారం ముహూర్తం అనుకూలంగా ఉందని భావించిన చాలామంది వ్యాపారులు భార్యాభర్తలుగా ఎక్సైజ్ కార్యాలయాలకు చేరుకొని దరఖాస్తులు చేసుకోవడంతో, కార్యాలయాల పరిసరాలు సందడిగా మారాయి. దరఖాస్తు రుసుము రూ. రెండు లక్షల నుండి మూడు లక్షలకు పెంచినా, మద్యం వ్యాపారం లాభదాయకమనే నమ్మకంతో ఎవ్వరూ వెనక్కు తగ్గడం లేదు. గత 2023%-%2025 లైసెన్స్ కాలంలో ఖమ్మం జిల్లాలో 7,200 దరఖాస్తులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5,000 పైగా దరఖాస్తులు రావడంతో రాష్ట్ర ఖజానాకు రూ.154 కోట్లు ఆదాయం వచ్చింది. ఈసారి దరఖాస్తులు కొద్దిగా తగ్గినా ఆదాయం మాత్రం ఇంకా ఎక్కువగా ఉంటుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే, పెరిగిన రుసుము ప్రతి దరఖాస్తుపై అదనంగా ప్రభుత్వానికి లక్ష రూపాయల లాభం తెచ్చిపెడుతోంది. 16 వరకు మెల్లగా సాగిన దరఖాస్తుల సమర్పణ శుక్రవారం ఒక్కరోజే వేగంగా మారింది. ఖమ్మం జిల్లాలో ఒక్కరోజే 1,850 దరఖాస్తులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,350 దరఖాస్తులు సమర్పించబడ్డాయి. చివరి రోజు శనివారం కావడంతో మరో రౌండ్ రద్దీ కనిపించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మద్యం వ్యాపారంలో భాగస్వామ్యం కావాలనుకునే అనేక వ్యాపారులు ఈసారి కుటుంబ సభ్యుల పేర్లతో దరఖాస్తులు వేస్తున్నారు. కొందరు 'లక్కు కిక్కు' కొట్టాలన్న ఆశతో భార్యల పేర్లతో దరఖాస్తులు చేసుకోవడం గమనార్హం. ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట టోకెన్ కోసం పెద్ద క్యూలైన్లు కనిపించాయి. సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించగా, లోపల ఉన్న వారందరి ఫారమ్‌లను అధికారులు స్వీకరించారు. ఎన్నికల సీజన్ కొనసాగుతుండటంతో కొంతమంది కొత్త వ్యాపారులు కూడా ఈ సారి అడుగుపెడుతున్నారు. ఒక వైపు రాజకీయ పోటీలు, మరో వైపు మద్యం వ్యాపార పోటీలు సమాంతరంగా నడుస్తుండటంతో జిల్లా ఎక్సైజ్ కార్యాలయాలు కదలికలతో కిటకిటలాడుతున్నాయి. మద్యం టెండర్ల ప్రక్రియ చివరి రోజు ముగిసే సరికి ఎంతమంది దరఖాస్తులు చేరతాయనే ఆసక్తి పెరిగింది. అధికారులు మాత్రం "దరఖాస్తులు తక్కువైనా ఆదాయం ఎక్కువ వస్తుంది" అంటున్నారు. చివరి గంటల్లో ఎన్ని టెండర్లు సమర్పించబడతాయో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ దృష్టి ఖమ్మం జిల్లాపైనే కేంద్రీకృతమైంది.

# 42 శాతం బీసీ బిల్లును తక్షణమే 9 షెడ్యూల్లో చేర్చాలి




**నేలకొండపల్లి, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే పార్లమెంటులో ఆమోదించి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి, మాజీ ఎంపీపీ రచ్చ నరసింహారావు డిమాండ్ చేశారు. శుక్రవారం 42 శాతం బిసి బిల్లు ఆమోదం పట్ల బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ సిపిఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కదం తొక్కారు. తొలుత స్థానిక పార్టీ కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనం నుండి పార్టీ జెండాలు చేతబట్టి ప్రదర్శనగా బయలుదేరి పొట్టి శ్రీరాములు సెంటర్ కు చేరుకున్నారు. బీసీల పట్ల బిజెపి నిర్లక్ష్య వైఖరి నశించాలి, బీసీ బిల్లును తక్షణమే తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలి అంటూ నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు స్థానిక బిజెపి, ఇతర అన్ని పార్టీలు ఏకగ్రీవంగా అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లును రాష్ట్ర గవర్నర్ ఆమోదించకుండా, రాష్ట్రపతికి పంపించి తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. బీసీ బిల్లులో ముస్లింలు ఉన్నారని బిజెపి ద్వంద వైఖరి పాటిస్తున్నదని, ముస్లింలలో వెనుకబడిన వర్గాలకు చెందిన దూదేకుల, అత్తరు సాయిబులు, ఫకీర్లు కూడా బీసీ జనాభాలో భాగంగా ఉన్నారనే విషయాన్ని బిజెపి ప్రభుత్వం గుర్తించాలన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో కూడా ముస్లింలలోని వెనుకబడిన వర్గాల వారు బీసీలుగా ఉన్నారని వారికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బీసీ రిజర్వేషన్ బిల్లును రాష్ట్రంలోని బిజెపి పార్టీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కావాలనే అడ్డుకుంటూ ద్వంద వైఖరిని అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా తెలంగాణ బిజెపి పార్టీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే స్పందించి 42 శాతం బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదించి, తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పార్టీల ప్రతినిధులను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా అవసరమైన కార్యచరణ రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, మండల నాయకులు ఎడ్ల తిరుపారావ్, మార్తి కొండలరావు, బలుసు ప్రమీల, భూక్య కృష్ణ, ఏటుకూరి రామారావు, పెద్దిరాజు నరసయ్య, మందడపు మురళీకృష్ణ, యరదేశి నరసింహారావు, కొత్తూరు వెంకటాచారి, పోతనపోయిన పెరుమాళ్ళు, కంటూ పుల్లయ్య, పగడాల నాగేశ్వరరావు, పచ్చిపాల వెంకటరత్నం, గంజికుంట్ల వెంకటయ్య, సామల మల్లికార్జున, తిరుమలి, కొప్పుల సైదులు, నెల్లూరి నాగేశ్వరరావు గరికపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

# పాన్ షాపులపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు



**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట పట్టణంలోని పలు పాన్ షాపులపై చైతన్యం – డ్రగ్స్‌పై యుద్ధం కార్యక్రమంలో భాగంగా పోలీసులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్ముతున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే సమయంలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సైలు యయాతిరాజు, రామూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ రక్షణ కవచం!

- అవినీతి యథాతథం
- వైరా వేర్‌హౌస్‌లో విపరీతాల వనరులు!
- పోస్టుల పదిలం కోసం పరాకాష్టకు పైరవి
- తనిఖీతో సరిపెట్టుకున్న ఉన్నతాధికారులు
- నేతల చుట్టూ ప్రదక్షిణలు .. ప్రజా ధనం లూటీ!

**ఖమ్మం బ్యూరో, మహా:** వైరా వేర్‌హౌజింగ్ గోదాముల్లో జరుగుతున్న అక్రమాలు ఇప్పుడు కొత్త మలుపు తీసుకున్నాయి. అధికారుల బదులు రాజకీయ పైరవి, అర్హతల బదులు బంధుత్వం, నిబంధనల బదులు నోట్ల ప్రభావం అనే త్రివేణి సంగమం అక్కడ రూపుదిద్దుకుంది. ఒక పక్క రైతుల ధాన్యం భద్రపరచడానికి, పంటనష్టాన్ని నివారించడానికి ఏర్పాటైన వేర్‌హౌజ్‌లు, ఇప్పుడు రాజకీయ లాబీలకు కేంద్రాలుగా మారిపోయాయి. చట్టాల కళ్లను మూసేసిన అధికారి వ్యవస్థ, తనిఖీ పేరుతో ఫోటో దిగడం వరకే పరిమితమైపోయింది. ఫలితంగా నియామకాలలో అర్హతల కన్నా పరిచయాలు, పనితీరు కన్నా పార్టీ నిబద్ధత, క్రమశిక్షణ కన్నా కమీషన్ నిర్ణయాత్మకం అయ్యాయి. ఇటీవల వైరా వేర్‌హౌజింగ్‌లో జరిగిన అక్రమ నియామకాలు, పోస్టుల పదిలం కోసం జరుగుతున్న రాజకీయ పైరవి, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం.. ఆల్ కంబైన్ టుగెదర్.. ప్రజా వ్యవస్థను అవినీతి మయంగా మార్చేస్తున్నాయి. ఇక్కడ నిబంధనలు, అర్హతలు అన్నీ పక్కన పెట్టి, "ఎవరు ఎవరికి దగ్గర?" అన్న ప్రశ్న ఒక్కటే చలామణి అవుతోంది. వైరా వేర్‌హౌజింగ్ గోదాముల్లో అక్రమ నియామకాల వ్యవహారం రోజురోజుకూ మరింత బహిర్గతమవుతోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, నిబంధనలకు విరుద్ధంగా అనర్హులను ఉద్యోగాల కోసం నియమించడం మాత్రమే కాకుండా, ఇప్పటికే విధుల్లో ఉన్న ఉద్యోగులను కూడా కొంతమంది రాజకీయ నాయకులు కాపాడుకునేందుకు పైరవి పరాకాష్టకు చేరినట్లు సమాచారం. తనిఖీకి వచ్చిన ఉన్నతాధికారులు కేవలం కాగితాల పరిశీలనతోనే సరిపెట్టుకోవడం, ఫీల్డ్ లెవెల్ పరిశీలన చేయకపోవడం ఈ వ్యవహారంపై అనుమానాలు రేకెత్తిస్తోంది. అధికారుల ఈ నిర్లక్ష్యం వెనుక రాజకీయ ఒత్తిడులున్నాయా? లేక ఆర్థిక లాభాల వాసనదా? అనే ప్రశ్నలు జిల్లాలో చర్చనీ యాంశంగా మారాయి. వైరా వేర్‌హౌజ్‌లో నియామకాలకు సంబంధించి, "పనికి మానవులు కాదు –పరిచయాలే మార్గం" అనే మాట స్థానికంగా వినిపిస్తోంది. వేర్‌హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కి తెలియకుండానే అధికారులు గుట్టు చప్పుడు కాకుండా ఎంపికలు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఆ ఉద్యోగుల్లో కొందరు రాజకీయ నేతలకు సన్నిహితులు, మరికొందరు ప్రభావవంతమైన నాయకుల బంధువులుగా గుర్తించబడ్డారు. పదవుల పదిలం కోసం కొందరు అధికారుల చుట్టూ నేతలు తిరుగుతూ ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యాలు చూడగానే పరిపాలనా వ్యవస్థ ఎంత దిగజారిందో స్పష్టమవుతోంది.

# బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

**మణుగూరు, మహా :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై బీజేపీ పార్టీ అవలంబిస్తున్న దొంగ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మనుగూరు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 18న బీసీ సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పిలుపు నిచ్చిన బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు సోషల్ మీడియా వేదికగా శుక్రవారం ప్రకటించారు. బీసీ వర్గాల న్యాయ హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, బీజేపీ మోసపూరిత ధోరణిని బహిర్గతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు బంద్ లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# మండల కేంద్రాలలో బిసి బంద్

**టేకులపల్లి మహా:** టేకులపల్లి మండలంలో జరగబోయే బీసీ బందు కు మండలంలోని బీసీ బిడ్డలు ఏకపక్షంగా ధర్నాలో 42% రిజర్వేషన్ ఇచ్చేదాకా బీసీల మందిరం ఐక్యంగా ఉద్యమం కొనసాగించాలని మండలంలోని బిసి నాయకులు 18 తారీఖున మండల కేంద్రంలో 10 గంటలకు ఏకమై బీసీ ధర్నాకు విజయం నాయకులు చేస్తున్నారు

# ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



**ముదిగొండ, మహా :** మండలంలోని ఇసుక అక్రమ రవాణాకు పోలీసులు నడుంబిగించారు. ఇసుక అక్రమ రవాణా చేయకుండా అడ్డుకట్ట వేసేందుకు మండలపరిధిలో గంధసిరి మున్నేరు లోకి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా ఇసుక రేవు సమీపాన జెసిపితో శుక్రవారం సిఐ వద్దేపల్లి మురళి కందకం తవ్వించారు.ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలను అధిగమించి ఇసుక అక్రమంగా తోలకాలు చేస్తే కఠినచర్యలు తప్పవని సీఐ వద్దేపల్లి మురళి ఇసుక అక్రమదారులను హెచ్చరించారు.గంధసిరి, పెద్దమండవ మున్నేరుల నుండి ఇసుక అక్రమ రవాణా జరిగితే,పోలీసులకు సమాచారం ఇచ్చి స్థానికులు సహకరించాలని ఆయన సూచించారు. ఇసుక రేవుల దగ్గర పోలీసు నిఘా పెంచినట్లు ఆయన చెప్పారు.

# నేటి బంద్ విజయవంతం చేయండి

**దమ్మపేట , మహా:** బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా 42% రిజర్వేషన్ అమలకై మన బీసీ హక్కుల సాధన కొరకై బిసి జెఎసి పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేడు 18 తేదీన బంద్ కు పిలుపు ఇచ్చిన క్రమంలో మండల బిసి సంఘాలు మద్దతుగా నిలిచాయి. ఈ మేరకు పట్టణ పరిధిలోని వ్యాపార సముదాయాలు మూసివేసి బిసి బంద్ కు సహకరించాలని కోరారు. ఇందుకు అఖిలపక్షం రాజకీయ నాయకులు ,కాంగ్రెస్ నాయకులు మద్దతు ఇస్తున్నారు. అన్ని కులాల బిసి సంఘం కుల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదే క్రమంలో కుమ్మరి శాలివాహన ప్రజాపతి వ్యవస్థాపక అధ్యక్షుడు కొలివలం పూర్ణ చంద్రరావు ప్రజాపతి పిలుపు మేరకు దమ్మపేట మండల కుమ్మరి సంఘం బంద్ లో పాల్గొనున్నట్లు తెలిపారు. యాదవ సంఘం జిల్లా నాయకులు యరగొర్ల రాధాకృష్ణ యాదవ పెద్దలను బంద్ లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.